డా|| బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం - శ్రీకాకుళం
(Accredited with NAAC 'B' Grade, UGC-12(B) Status, 2(F) Recognised and ISo 9001:2015)
Estd. 2008

# ఆచార్య రోణంకి అప్పలస్వామి జయంతి ప్రత్యేక సంచిక



ETCHERLA - SRIKAKULAM, A.P., INDIA-532410 | September 15, 2022 | Tel.No.08942-240900, www.brau.edu.in

## బహుభాషా అధ్యయనకారులు ఆచార్య 'రోణంకి'!

ఎందరో మహనీయులు, మరెందరో పోరాటయోధులు, ఇంకెందరో కలం వీరులు కన్న నేల మరో ప్రజ్ఞాశీలిని, సాహితీ కోవిదుడిని అందించింది. అతని కలం కళింగాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దింది. రచయితగా, బోధకుడిగా, అనువాదకుడిగా, సాహితీ విమర్శకుడిగా, అభ్యుదయవాదిగా ఆచార్య రోణంకి అప్పలస్వామి చేసిన పయనం తరతరాలకు తరగని స్ఫూర్తిని పంచింది. ఎటువంటి పురస్కారాలకు నోచుకోకపోయిన మేధావులు, అభిమానులు, సాహితీకారులు, విద్యాధికులచే ఆచార్యునిగా పిలవబడిన 'రోణంకి' 1909 సెప్టెంబరు 15వ తేదీన శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం సమీపాన ఇజ్జువరం గ్రామంలో జన్మించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ (ఆంగ్లం) పట్టాను పొంది జీవన పయనంలో భాగంగా విజయనగరం ఎంఆర్ కళాశాలలో ఆంగ్లబోధకుడిగా 1934లో కెరీర్ ప్రారంభించారు. మూడో ఫారం చదువుతుండగానే పోతనభాగవతంలోని ఘట్టాలను కంఠస్థం చేసిన అప్పలస్వామి, తర్వాత కాలంలో ప్రపంచమే నివ్వెరపోయేటంత భాషావేత్తగా ఎదిగారు. తెలుగులో పండితునిగా పేరుగాంచిన ఆంగ్లకవిగా సాహితీ, రచన వ్యాసంగాల్లో ప్రతిభామూర్తిగా వెలుగొందారు.

### బహుభాషల అధ్యయనకారుడు :

ఒక వైపు ఆంగ్లశాఖ అధ్యాపకునిగా కొనసాగుతున్నా ప్రపంచంలోని పలు భాషలు అధ్యయనం చేసేందుకు ఆసక్తి చూపేవారు ఆచార్య రోణంకి. ఫ్రెంచ్, స్పానిష్, గ్రీకు, హిబ్రూ, ఇటాలియన్ వంటి యూరోపియన్ భాషలను అధ్యయనం చేయుటయే కాకుండా అందులో అనువాదం చేసేటంతటి ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఆయా భాషల్లో కవితలు, రచనలు చేసి తెలుగువారికి సైతం స్ఫూర్తిగా నిలిచారు. గ్రామఫోన్ ప్లేట్లు పెట్టుకొని జర్మన్, లాటిన్, జడటపా భాషల్లో నైపుణ్యం సంపాదించారు. హిందీ, ఒడియా, కన్నడం, బెంగాలీ వంటి భాషల్లో సైతం అనర్గళంగా మాట్లాడే శక్తి సొంతం చేసుకున్నారు. బహుభాషల్లో పట్టు సాధించినప్పటికీ ఆంగ్లభాషలో అంతర్జాతీయ ఖ్యాతిగాంచారు.

### గొప్ప అనువాదకుడు :

తెలుగులో పాండిత్యం, ఆంగ్లంలో మంచి ప్రావీణ్యం పొందిన ఆచార్య రోణంకి... వివిధ భాషల్లో ఉత్తమ రచనలను ఆంగ్లంలోకి, ఇంగ్లీష్‌లోని మంచి రచనలను ఇతర భాషల్లోకి అనువదించి గొప్ప అనువాదకునిగా ఖ్యాతిగాంచారు. విజయనగరంలో వున్న తొలినాళ్లలో 'సాంగ్స్ అండ్ లిరిక్స్' పేరిట తొలికవితా సంపుటిని 1935లో వెలువరించారు. అల్లసాని పెద్దన, క్షేత్రయ్య రచనలను ఆంగ్లీకరించారు. మేకియవెల్లి ఇటాలియన్ భాషలో రాసిన 'ప్రిన్స్' గ్రంధాన్ని, 'రాజనీతి' పేరుతో తెలుగులోకి సరళంగా అనువదించారు. ఈ పుస్తకం భారతీయ భాషలన్నింటిలోకి కేంద్రసాహిత్య అకాడమీచే అనువాదం కావడం ఎంతో విశేషం. మహాకవి గురజాడ కలం నుంచి జాలువారిన 'పూర్ణమ్మ గేయాలు', 'తోక చుక్క'లను ఇంగ్లీష్‌లోకి అనువాదించారు. ఆచార్య అప్పలస్వామిలోని భాషాప్రావీణ్యాన్ని ప్రస్తావించుకున్నప్పుడు ఒక ఘటనను గుర్తు చేసుకోవచ్చు. 1978లో కాకినాడలో జరిగిన అరసం సభకు జర్మనీ దేశీయుడు హాజరయ్యారు. అతనితో సంభాషించిన అప్పలస్వామితో ఆ దేశీయుడు 'మీరు జర్మనీలో ఎన్నేళ్లుపాటు వున్నారని





ఆచార్య రోణంకి అప్పలస్వామి గారికి జన్మనిచ్చిన టెక్కలి సమీపంలో గల ఇజ్జువరం గ్రామం

---

## ఇద్దరు అప్పలస్వాములు



వాళ్ళిరువురు కళింగాంధ్ర సాహితీ మూర్తులు. అభ్యుదయ రచయితలు, సాహితీ మిత్రులు. గిడుగురామ్మూర్తి, గురజాడ అప్పారావుల తరువాత వ్యవహారిక భాషోద్యమానికి నడుం బిగించినవాళ్ళు. ఈ యుగం నాది అని సగర్వంగా చాటిన శ్రీశ్రీ కలం నుండి జాలువారిన అక్షరాలను దిద్దినది ఒకరైతే, పత్రికలలో ప్రమురించినది మరొకరు. వారే పురిపండ అప్పలస్వామి, రోణంకి అప్పలస్వామి. తెలుగుతోపాటు ఒరియా, బెంగాలీ, హిందీ, సంస్కృతం, ఆంగ్ల భాషలలో పురిపండ దిట్ట అయితే, తెలుగు, హిందీతోపాటు మరో 10కి పైగా విదేశీ భాషలలో ఘనాపాఠి రోణంకి.



## నెరవేరని అభిమానుల కోరిక



విశాఖపట్నం రామకృష్ణ బీచ్

ప్రపంచ భాషా నిఘంటువుకు చిరునామాగా నిలిచిన ఆచార్య రోణంకి అప్పలస్వామి విగ్రహం.... అతను పుట్టిన నేలలోగాని, తను తిరిగిన ప్రాంతంలోగాని లేకపోవడం ఎంతో బాధాకరమని అతని అభిమానులు, శిష్యులు, సాహితీకారులు, విద్యావంతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం పట్టణంలోని నాగావళి నది బ్రిడ్జి మార్గంలో ఉన్నటువంటి అనేకమంది మహనీయుల విగ్రహాల సరసన గాని, విశాఖ సాగర తీరాన ఏర్పాటు చేసిన ఎంతోమంది నేతలు, సాహితీవేత్తలు విగ్రహాల వరుసలోగాని, విజయనగరం పట్టణ కూడలిలలోగాని ఆచార్య రోణంకి విగ్రహం లేకపోవడం ఎంతో వెలితిగా ఉన్నదని పలువురు భావిస్తున్నారు. పాలకులు, సాహితీ సంస్థలు, ఇంటాక్ తదితర సంస్థలు ముందుకు వచ్చి ఆచార్య రోణంకి విగ్రహాన్ని ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుచున్నారు.



శ్రీకాకుళం నాగావళి వంతెన

ఈ నేలలో పుట్టి రచయితగా, అధ్యాపకుడిగా, అనువాదకుడిగా, సాహితీ విమర్శకుడిగా, అభ్యుదయవాదిగా ప్రపంచఖ్యాతి గాంచిన ఆచార్య రోణంకి అప్పలస్వామి 113వ జయంతి కార్యక్రమాన్ని డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించతలపెట్టింది. ఈ మహనీయుని నివాళులు అర్పించేందుకు గాను నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఆచార్య అప్పలస్వామి శిష్యులు, సన్నిహితులు, సాహిత్య అభిమానులు పాల్గొని తమ అనుభవాలు పంచుకునేందుకు విశ్వవిద్యాలయం వేదిక కానుంది. ఇందులో భాగంగా డా|| బిఆర్ఏయూ జర్నలిజం అండ్ మాస్‌కమ్యూనికేషన్ విభాగం, ఆంగ్ల విభాగం, తెలుగు విభాగంలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.

### డా. బిఆర్ఏయూ గురించి:



1977లో ఆంధ్ర విశ్వవిద్యాలయం పీజీ కేంద్రంగా నాలుగు కోర్సులతో బోధనను ప్రారంభించింది. 2008లో యూనివర్శిటీ స్థాయిను అందుకొని డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంగా విద్యార్థులకు, ఈ ప్రాంతానికి ఉన్నతవిద్యా సేవ చేస్తుంది. ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలలుగా 25 పీజీ, యూజీ కోర్సులను విశ్వవిద్యాలయంలో నేడు అఫర్ చేస్తున్నారు. ఐఎస్ఓ 9001-2015 సర్టిఫికెట్‌తో పాటు యూజీసీ 12(బి), 2(ఎఫ్) స్థాయిని కలిగి ఉంది. అదేవిధంగా నాక్ 'బి' గ్రేడ్‌ను పొంది అంచెలంచెలుగా ప్రగతి పథనా పయనిస్తోంది. గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక వసతులు అందిస్తూ పలువురు ప్రశంసలను పొందినది. ప్రస్తుత వర్శిటీ ఉపకులపతి ఆచార్య నిమ్మ వెంకటరావు నేతృత్వంలో రిజిస్ట్రార్ ఆచార్య సిహెచ్.ఎ. రాజేంద్రప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.అడ్డయ్య మార్గదర్శకంలో మరిన్ని విజయాలు సాధనకు ప్రణాళికలు రూపొందించడం జరిగింది. మరోవైపు యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాల పరిధిలో 2006లో ఆంగ్ల విభాగం, 2011లో తెలుగు విభాగం, 2016లో జర్నలిజం అండ్ మాస్‌కమ్యూనికేషన్ విభాగం ఏర్పడి బోధన, అధ్యయనల ద్వారా ప్రత్యక్షంగా, పలు వినూత్న, ప్రయోజకర, సేవా కార్యక్రమాలతో పరోక్షకంగా వర్శిటీ ప్రగతిలోనూ, సమాజ అభివృద్ధిలోనూ భాగస్వామ్యమవుతూ వస్తున్నాయి. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి పలు వర్క్‌షాపులు నిర్వహించడమే కాకుండా ఈ ప్రాంత ప్రముఖులను, విద్యావేత్తలను, రచయితలను స్మరించుకుంటూ పలు కార్యక్రమాలను ఈ విభాగంలో గతంలో అనేక సార్లు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా బహుభాషాకోవిదుడు ఆచార్య రోణంకి అప్పలస్వామి జయంతిని ఈసారి నిర్వహిస్తున్నాము.

Concept & Execution by the Dept. of Journalism & Mass Communication and Media Cell,
**Dr.BRAU, SKLM**

ప్రశ్నించారు. భారతదేశ పొలిమేరలు నేను దాటలేదన్న రోణంకి సమాధానంతో ఆశ్చర్యపోయి, అప్పలస్వామికు అభిమానిగా మారటం అతని వంతైంది. ఈ ప్రస్తావన ఆయనలోని అనువాదకుడిని మనకు పరిచయం చేస్తుంది. చా.సో. రాసిన కుంకుడాకు, వంతెనకింద కథలను ఆంగ్లంలోకి అనువాదించారు. విశ్వనాథ, శ్రీశ్రీ, నారాయణబాబు, విశ్వసుందరమ్మ, చాకలి బంగారమ్మ వంటివారిని ప్రపంచ కవితా ప్రియులకు పరిచయం చేసింది రోణంకి వారే. సమాచార శాఖ కోరిక మేరకు, ప్రముఖ క్రీడాకారుడు కోడిరామూర్తి పై పుస్తకాన్ని రచించారు. చివరి రోజుల్లో 'దినావ్ అండ్ అదర్ పోయిమ్స్' కవితా సంపుటిని 1985లో విడుదల చేశారు.

### ప్రాంతీయ ఉపన్యాసకుడు:

బోధకుడు, బహూభాషాకోవిదుడు, సాహితీవిశారదుడిగానే కాకుండా జాతీయ ఉపన్యాసకుడిగా విశిష్టత పొందారు రోణంకి మాష్టారు. పలు భాషల్లోని వ్యాసాలను ఆంగ్లంలోకి అనువదించి ఆకాశవాణి ద్వారా ఎందరో శ్రోతలకు చేరువయ్యారు. స్వామి వివేకానంద, గురజాడ అప్పారావులపైన, మిల్టన్ పైన ఆయన ధారావాహిక ప్రసంగాలను ఆకాశవాణిలో చేశారు. 1972-77 మధ్యకాలంలో ఆచార్య అప్పలస్వామిని జాతీయ ఉపన్యాసకునిగా భారత ప్రభుత్వం నియమించింది. ఈ హోదాలో దేశమంతా పర్యటించి ఉపన్యాసాలు ఇచ్చారు. దేశ వ్యాప్తంగా ఒకే విద్యావిధానం వుండాలని, కేంద్రమే విద్యాబాధ్యత తీసుకోవాలని ప్రచారం చేశారు.

## చివరి రోజులు టెక్కలిలో...

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తన నాలుగేళ్ళ గౌరవ ఆచార్యునిగా బాధ్యతలు ముగించుకున్న తర్వాత...తన స్వస్థలమైన టెక్కలిలో స్థిరపడ్డారు రోణంకి అప్పలస్వామి. 1987లో తుదిశ్వాస విడిచే వరకూ టెక్కలిలోనే గడిపారు. స్వగ్రామంలోనూ కొన్నాళ్ళు ఉంటూ మళ్లీ టెక్కలి చేరారు. గోపినాథపురం గ్రామానికి ముందు వచ్చే రైలు గేటు దరి నివాసం ఉండేవారు. తన స్నేహితులు, సాహితీ సహచరులు, రచయితలు రోణంకిని కలవడానికి టెక్కలి వచ్చేవారు. అప్పుడప్పుడు టెక్కలిలో జరిగే సాహితీ కార్యక్రమాలకు కూడా అప్పలస్వామి మాష్టారు హాజరవుతుండేవారు. చివరిరోజుల్లో అనారోగ్యంపాలై ఆసుపత్రిపాలైనపుడు నాటి 'ఆంధ్రభూమి' దినపత్రిక 'రోణంకి కన్నుమూత' అని వార్త ప్రచురించింది. అయితే అది చూసిన రోణంకి, తన వార్తను తాను చూసుకునే అవకాశం దొరికిందని నవ్వుకున్న ఆశావాది అప్పలస్వామి మాష్టారు.



టెక్కలి

## ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గౌరవ ఆచార్యునిగా...




ఆంగ్లభాషలో ఉత్తమ బోధకుడిగా, పలు భాషల్లో నిష్ణాతుడిగా ఖ్యాతిగాంచిన రోణంకి అప్పలస్వామిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బోధన చేయమని ఆహ్వానం లభించింది. యూజీసీచే గౌరవ ప్రొఫెసర్‌గా నియమించబడ్డారు. ఎంఆర్ కళాశాలలో ఆంగ్ల శాఖాధిపతిగా పదవీ విరమణ చేసిన అనంతరం 1974-78 మధ్య కాలంలో ఏయూ ఆంగ్లశాఖలో ఆచార్యునిగా బోధనలు చేశారు. తన స్వగృహం టెక్కలి నుంచి ప్రయాణం చేస్తూ ఆచార్యునిగా ఆ సమయంలో బాధ్యతలు నిర్వర్తించారు.

## విజయనగరమంతా రోణంకి వారిదే



మహారాజా కళాశాల


ఆచార్య రోణంకి అప్పలస్వామి జీవన పయనం అధిక భాగం విజయనగరంతో ముడిపడి ఉంది. 1934లో ఎంఆర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా కెరీర్ ప్రారంభించిన రోణంకి, నాలుగు దశాబ్దాలు పాటు విజయనగరంలోనే గడిపారు. తన బోధనలు, ఉపన్యాసాలు, సాహితీ చర్చలు ద్వారా వేలాది శిష్యులను సంపాదించుకున్నారు. సమగ్రంథ్రా రచనకు ఆద్యుడైన ఆరుద్ర సైతం, రోణంకికు శిష్యులయ్యారు. చాసో, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ వంటివారంతా రోణంకి ఇంటినే తన సాహితీచర్చల కేంద్రంగా మార్చుకున్నారు. ఎంఆర్ కళాశాల సహచరులు ఎంతో మంది రోణంకి ఇంటికి వస్తూపోతుండేవారు.



## ఓ సరదా సన్నివేశం



"తీర్థం-'చుట్ట'రికం" విద్యల నగరంగా వాసికెక్కిన విజయనగరంలోని కస్పా చిన్ని వీధిలో గల ప్రఖ్యాత కథా రచయిత, కథకులకు కథకుడైన చాగంటి సోమయాజులు(చాసో)గారిల్లు ఓ సాహిత్య దర్బారుగా విరాజిల్లేది. అతనికి అత్యంత ఆత్మీయుడైన సాహితీ మిత్రుడు, బహు భాషా కోవిదుడు,అక్కడి మహరాజా కళాశాల ఆంగ్ల భాషా శాఖాధిపతి ఆచార్య రోణంకి అప్పలస్వామి తరచూ చాసో ఇంటికి వెళ్తుండే వారు. కొన్నాళ్లు చాసో ఇంట్లోని ఓ ప్రత్యేక గదిలో ఉండేవారు కూడా. తెలుగు సాహిత్యంపై ఆంగ్ల సాహిత్య ప్రభావం,తెలుగు భాషలో ఆధునిక ధోరణులు తదితర అంశాలపై గంటల తరబడి చర్చిస్తుండే వారు. 1979 ప్రాంతంలో రోణంకి వారు చాసోతో ముచ్చటిస్తుండగా ఓ ఆసక్తికరమైన అంశం ప్రస్తావనకు వచ్చింది. చాసో మాట్లాడుతూ 'తీర్థానికి' దూరంగా ఉంటే బావుణ్ణు కదాబీ అని రోణంకిని ఉద్దేశించి చనువు తీసుకుని నవ్వుతూ అన్నారు. అందుకు రోణంకి.. అది సరేకాని తమరు ఎప్పుడు చూసినా నోట్లో చుట్టతోనే దర్శనం కదా అది మానిస్తే నేను సైతం తీర్థం మానేస్తాను అన్నారు. దీనికి చాసో తలగోక్కుంటూ 'చుట్ట'తో చుట్టరికాన్ని తెంచుకోలేను. చుట్ట లేకపోతే కలం కదలదని జవాబిచ్చారు. నేను కూడా అంతే మరి. తీర్థం లేకపోతే మంచి, మంచి ఆలోచనలే రావని,పైగా ఏదో ఔషధంలా తీసుకుంటానని రోణంకి ప్రతిస్పందిస్తూ అన్నారు. ఈ రెండూ జరగని పనులని ఇద్దరూ నవ్వుకుంటూ చర్చకు ఫుల్ స్టాప్ పెట్టారు. మొత్తం మీద వీరిద్దరి ముఖాల్లో నవ్వులు పువ్వులు వెల్లివిరిశాయి. ఇద్దరూ ఇద్దరే. వీరి బంధం, సాహితీ అనుబంధం అలాంటిది.



## ఎందరో సహచరులు మరెందరో అనుచరులు

సాహితీవేత్తగా ప్రసిద్ధిగాంచిన ఆచార్య రోణంకి సహచరత్వం, అనుచరత్వం ఎందరో కోరుకున్నారు. విద్యార్థి దశ నుంచి తుది క్షణం వరకూ చాగంటి సోమయాజులు (చా.సో) ఆయనకి మంచి మిత్రులు, శ్రీ రంగ నారాయణ బాబు, చిర్రావూరి సర్వేశ్వర శర్మలు రోణంకికి మంచి సాహితీ స్నేహితులు. ప్రముఖ చిత్రకారుడు అంట్యాకుల పైడారాజు, మాష్టారుతో ఎంతో సాన్నిత్యం కలిగి ఉండేవారు. ప్రముఖ రచయిత ఆరుద్ర, రోణంకి మాష్టారుకు శిష్యుడే. అందుకే తన తొలి కావ్యం 'త్వమేవాహం'ను ఆచార్య అప్పలస్వామికి అంకితం చేశారు ఆరుద్ర. డాక్టర్ మానేపల్లి తన తొలి కవితా సంపుటి 'వెలిగించే దీపాలు'ను రోణంకి గారికే అంకితమిచ్చి మాష్టారు రుణం తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశంలో పలు విశ్వవిద్యాలయాల్లో భాషా అధ్యాపకులు, భాషా శాస్త్రవేత్తలుగా రోణంకి శిష్యులు రాణించారు.

## విస్మరించిన నేటి తరం




ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టెక్కలి

సాగరతీరానికే ఒక వెలితి. ఆయన స్మారకార్థం ప్రత్యేక ఉపన్యాస నిధి ఏర్పాటు చేయాలన్న అభిమానులు కోరిక నేటికి నెరవేరలేదు. అభిమానులు మాత్రం ఆయన చివరి రోజుల్లో గడిపిన ఊరులో(టెక్కలి)ని జూనియర్ కళాశాలలో 1998 సెప్టెంబరు 15వ తేదీన విగ్రహాన్ని (ప్రముఖ శిల్పి దివిలి అప్పారావు చేతులమీదుగా రూపు దిద్దుకున్న) ఏర్పాటు చేయగా జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ దీన్ని ఆవిష్కరించారు. రోణంకి పుస్తకాలు, సేకరించిన గ్రంథాలను అతని వారసులు విశాఖలోని పౌర గ్రంథాలయానికి అందజేసి ప్రజలకు అందుబాటులోకి వుంచారు. టెక్కలి ప్రజలు ఒక వీధికు రోణంకి అప్పలస్వామి వీధిగా నామకరణం చేసి నివాళిలు అర్పించారు.

తెలుగులో మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు, పుట్టపర్తి నారాయణాచార్యులతో పాటు బహుభాషల్లో ప్రావీణ్యం సంపాదించిన ఆచార్య రోణంకిని పాలకులు, పరిశోధకులు, సాహితీ సంస్థలు విస్మరించాయని చెప్పవచ్చు. ఉత్తరాంధ్ర రాజధాని అయిన విశాఖలో కూడా ఆయన జ్ఞాపకాలు నిక్షిప్తం కాలేదు. విశాఖ బీచ్‌లో ఆయన విగ్రహం లేకపోవడం